క్లుప్తంగా

ఓటు వజ్రాయుధం



రామారెడ్డి : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది వజ్రాయుధం అని ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ (ఐఎస్‌ఆర్‌డీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సదాశివనగర్ మండల కేంద్రంలోని మండల మహిళ సమాఖ్య సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. చైతన్యశీలురైన ఓటర్లే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలన్నారు. చివర్లో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏంఈవో యోసెఫ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, డి.పి.యమ్ వకుళ, ఏపీఎం రాజారెడ్డి, మండల విద్యాధికారి యూసెఫ్ తదితరులున్నారు.

రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన ర్యాలీ



దోమకొండ : తెలంగాణ సౌత్ క్యాంపస్ భిక్కనూరుతో పాటు దోమకొండ గడికోట ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సౌత్ క్యాంపస్ ప్రొఫెసర్ డాక్టర్ అంజయ్య మాట్లాడారు. రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, గడికోట ట్రస్ట్ ప్రతినిధులు గణేశ్‌యాదవ్, భాస్కర్ తదితరులున్నారు.

ప్రజలకు అవసరమైన పనులను చేపట్టాలి



భిక్కనూరు : ప్రజలకు అవసరమైన పనులను ఉపాధిహామీ ద్వారా చేపట్టాలని భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని అంతంపల్లిలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పనులు చేసే కూలీలు వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు.

పాఠశాలలో పనుల పరిశీలన



పిట్లం(జుక్కల్): మండలంలోని అల్లాపూర్ గ్రామం అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను సోమవారం పంచాయతీరాజ్ శాఖ ఏఈ మొగులయ్య పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున పాఠశాలలో పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బరంగెడ్గిలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



బాన్సువాడ : బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామంలో సోమవారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని బంతే సంగ్ పాల్ గురువు ఆవిష్కరించారు. దళిత సంఘం నాయకులు బంగారు మైశయ్య, బంగారు సాయిలు, ప్రశాంత్, కాదేపురం గంగన్న, కాకయ్య, మహేష్, గంగారం ఉన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



సాయికుమార్



అనిల్‌కుమార్

కామారెడ్డి అర్బన్ : తెయూ అంతర్ కళాశాలల బాలుర విభాగం హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు సాయికుమార్, అనిల్‌కుమార్ విశ్వ విద్యాలయాల జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, పీడీ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మే 2న కేరళ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

జహీరాబాద్‌పై కాంగ్రెస్ జెండా ఎగరాలి



ఇతర పార్టీల కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



లక్ష్మాపూర్‌లో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నిజాంసాగర్(జుక్కల్): పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయంగా ప్రచారంలో ముందుకు వెళ్తున్నామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. సోమవారం మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి, తుర్కపల్లి గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మండల కాంగ్రె స్ నాయకులు జయప్రదీప్, ఆకాష్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డి : జహీరాబాద్ పార్లమెంట్ సీటును సాధించేది కాంగ్రెస్ పార్టీ అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి మండలంలోని జాన్కంపల్లి ఖుర్దు, లక్ష్మాపూర్, అడివిలింగాల, గండిమాసానిపేట, తిమ్మాపూర్ తదితర గ్రామాలలో ఎమ్మెల్యే మదన్‌మోహన్ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆగష్టు 15లోగా రైతులకు రూ. 2లక్షల రుణమాఫీని కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు బ్రహ్మాజీవాడి, చందాపూర్, సంగోజీవాడి, సంతాయిపేట్, ఎండ్రియాల్, కృష్ణాజీవాడి, కరడ్‌పల్లి గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను గెలిపించాలన్నారు.ఎంపీపీ రవి, మహేందర్‌రెడ్డి, శ్యాంరావు తదితరులున్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : గడప, గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వద్దకు తీసుకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దిశానిర్దేశం చేశారు. సోమవారం జుక్కల్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండలంలోని గుండూర్, మైబాపూర్, దోస్త్‌పల్లి, బంగారుపల్లి గ్రామాల్లో సోమవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు అస్పత్‌వార్ వినోద్, నాయకులు దేవదాస్, మారుతి తదితరులున్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముంబోజిపేట, కంచుమల్, కొండాపూర్ తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చేతి గుర్తుకు ఓటు వేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. సంతోష్ రెడ్డి, మోహిద్, రఫయోద్దీన్ తదితరులున్నారు.

బీజేపీతోనే పేదప్రజలకు లబ్ధి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని బాన్సువాడ నియోజక వర్గ ఇన్‌చార్జి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని దుర్కి గ్రామంలో బీజేపీ గడప గడపకు ప్రచారంలో పాల్గొన్నారు. నస్రుల్లాబాద్ ఇన్‌చార్జి సుధాకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు సున్నం సాయిలు, నాయకులు హన్మాండ్లు, వడ్ల సతీష్ తదితరులున్నారు.

మోదీతోనే దేశం సుభిక్షం

బాన్సువాడ : కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని పాత బాన్సువాడలో ఆయన ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఓటేసి ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలన్నారు. మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాశం భాస్కర్‌రెడ్డి, చీదరి సాయిలు, ర్యాల మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

కూలీల వద్దకు నాయకులు





ఉపాధి కూలీలతో బీఆర్‌ఎస్ నాయకులు, చేతి గుర్తుకు ఓటేయాలని కోరుతున్న కాంగ్రెస్ నాయకులు

గాంధారి(ఎల్లారెడ్డి) : పార్లమెంటు ఎన్నికల ప్రచారం మండలంలో జోరుగా సాగుతోంది. ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు ఇంటింటి ప్రచారంతో పాటు ఉపాధి పనులు జరిగే చోటుకు వెళ్లి ఓట్లు వేయాలని కూలీలతో అభ్యర్థిస్తున్నారు. సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేస్తామని, చేయి గుర్తుకు ఓటేయాలని కోరారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఆయన సోమవారం తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడి, బ్రహ్మాజీవాడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరారు. జెడ్పీటీసీ రమాదేవి, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వైస్‌ఎంపీపీ నర్సింలు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

రామారెడ్డి : బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ సదాశివనగర్ మండలంలోని వజ్జపల్లి యాచారం గ్రామాలలో ఇంటింటికి ఎన్నికల ప్రచారంను సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వరరావు, సీనియర్ నాయకులు శీను నాయక్, బద్దం శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తా



మాట్లాడుతున్న పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్ : బాన్సువాడలో వచ్చే హనుమాన్ జయంతి నాటికల్లా 108 ఫీట్ల హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గం ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన చిన్న రాంపూర్ గ్రామస్తులతో మాట్లాడారు. బీజేపీ మతం పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. తాను వ్యక్తిగతంగా హనుమాన్ భక్తుడినేనన్నారు. స్పీకర్‌గా పనిచేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి తిమ్మాపూర్‌లో శ్రీవెంకటేశ్వర ఆలయాన్ని నిర్మించారని గుర్తు చేశారు. పదేళ్లు ఎంపీగా పనిచేసిన బీబీపాటిల్, ఐదేళ్లు ఎంపీగా చేసిన సురేశ్ షెట్కార్ అభివృద్ధి చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను ఈసారి ఎంపీగా గెలిపించాలన్నారు. గ్యారంటీలు అమలు కాంగ్రెస్‌తో కావట్లేదన్నారు. పార్టీ మండల అధ్యక్షులు మోహన్‌నాయక్, వైస్ ఎంపీపీ హరిసింగ్, నాయకులు అంజిరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులున్నారు.

బీజేపీలో చేరిన వార్డు సభ్యుడు



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలోని 12 వార్డు సభ్యుడు బస్వరాజ్ సోమవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని అవుతారన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు నాగేళ్ల సాయికిరణ్, నాయకులు మాధవ్, మక్కన్న, యోగేష్, సతీష్, పోచగౌండ, బీరుగౌండ, రవి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

పిట్లం(జుక్కల్): బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గెలిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ పార్టీ రోడ్ షో, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, మాజీ జెడ్పీ చైర్మన్ దఫెదర్ రాజు, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

మీ గొంతుకనై పోరాడుతా..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో మీ గొంతుకనై పోరాడుతానని ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రోడ్డు షోలో కార్యక్రమం నిర్వహించారు. ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ఓట్లు అడగడం వారికే చెల్లిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అబద్దాల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చి ఉంటే నేను కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసేవాడినన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, మాజీ జెడ్పీటీసీ చైర్మన్ దఫెదర్ రాజు తదితరులున్నారు.

ఉపాధి కూలీలకు హెల్త్‌కిట్లు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని 31 జీపీల పరిధిలోని ఉపాధి పనులు చేస్తున్న వారి కోసం హెల్త్ కిట్లను అందించనున్నట్లు ఎంపీవో ప్రకాశ్ సోమవారం తెలిపారు. ఉపాధిహామీ పని ప్రదేశాల్లో హెల్త్‌కిట్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించడంతో వారి ఆదేశాల మేరకు మత్తమాల పీహెచ్‌సీ నుంచి హెల్త్ కిట్లను తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ తదితరులున్నారు.

రక్తదాన శిబిరం



బాన్సువాడ : ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పారిశ్రామిక వేత్త మోరియల్ శ్రీనివాస్‌రెడ్డి బర్త్‌డే సందర్భంగా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సుపరిండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్, పారిశ్రామిక వేత్త శ్రీనివాస్‌రావు, ఏఎస్‌ఆర్ జిల్లా అధ్యక్షులు రవి, సభ్యులు వాసరి సతీష్, అజీం తదితరులున్నారు.

కురుమ సమ్మేళనానికి తరలిన నేతలు



కామారెడ్డి రూరల్ : హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన కురుమ ఆత్మీయ సమ్మేళనం, కొల్లూరు మల్లప్ప ఫొటో ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుండి కురుమ సంఘం నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కురుమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మర్కంటి భూమన్న, కామారెడ్డి మండల అధ్యక్షుడు దొడ్లే మల్లేష్, తాడ్వాయి మండల అధ్యక్షుడు గంగారం, అడ్లూర్ ఎల్లారెడ్డి అధ్యక్షుడు బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

రాజంపేట : రాజంపేట మండలంలోని పొందుర్తి గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మండల వ్యవసాయాధికారిణి సుప్రజ్యోతి సందర్శించారు. ఈ సందర్భంగా వరి కొనుగోళ్లపై పాటించాల్సి నియమాలపై రైతులకు వివరించారు.

ప్రధాని సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



దోమకొండలో..

నిజాంసాగర్(జుక్కల్) : ప్రధాని మోదీ జహీరాబాద్ పార్ల మెంట్ ఎన్నికల ప్రచార సభకు నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి జయప్రదం చేయాలని బీజేపీ నాయకులు లింగాల శంకర్, రౌతు రాజు కోరారు. సోమవారం మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంలో బీజేపీ ఎన్నికల ప్రచార కార్యక్రమం సందర్భంగా సమావేశంలో వారు మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గ్ సభకు ప్రధాని మోదీ సభకు ప్రజలు తరలిరావాలన్నారు. ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపునకు కృషి చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు విఠల్, కృష్ణమూర్తి, సాతెల్లి శ్రీనివాస్, రాములు, శ్రీహరి, లింగం తదితరులు ఉన్నారు.

దోమకొండ : అల్లాదుర్గ్‌లో ప్రధాని మోదీ సభకు తరలిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు మద్దురి భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి బీబీపాటిల్ గెలుపుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు పన్యాల రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తిప్పాపురం రవి తదితరులున్నారు.

పిట్లం(జుక్కల్) : ప్రధాని మోదీ ఈనెల 30న అల్లాదుర్గం వస్తున్నందున ప్రజలు ఈ సభకు తరలిరావాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి పేర్కొన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్‌పై కాషాయ జెండా ఎగరేయడమే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా వేంకటేశ్వరాలయం వార్షికోత్సవం



భిక్కనూరు : మండల కేంద్రంలోని వేంకటేశ్వరాలయంలో ఆలయం వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. విష్వక్సేన పూజ అనంతరం ఆలయంలో వేంకటేశ్వరస్వామి విగ్రహంతో పాటు శ్రీదేవి-భూదేవి విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తదుపరి విగ్రహాలను ఊరేగించారు. పిదప భక్తులకు పెద్దఎత్తున ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో అన్నదానం



రామారెడ్డి : సదాశివనగర్ మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామంలో శ్రీ రాముల ఓడిబియ్యంను సోమవారం అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో రాములవారి కల్యాణం, నవరాత్రుల పూజలు చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్త బృందం యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప ఆలయ ఉత్సవాలు



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్‌లో బీరప్ప ఆలయ ప్రారంభోత్సవాలు వైభవంగా జరుపుతున్నారు. సోమవారం బీరప్ప, కామరాతి దేవతా మూర్తుల ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఆలయం ఆవరణలో దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు, పోతరాజుల విన్యాసాలను తిలకించేందుకు చుట్టు ప్రక్క గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలు తరలి వచ్చారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆలయ ఉత్సవాల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. మాజీ సర్పంచ్ గంగి సునిత రమేశ్‌యాదవ్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండలనాయకులు జయప్రదీప్, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాల ఊరేగింపు



బీబీపేట : మండలంలోని మల్కాపూర్ గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ రేణుకా జమదగ్ని ఉత్సవాల్లో బాగంగా సోమవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు ఊరేగించారు. బైండ్లోళ్ల ఆట పాటలతో, డప్పుచప్పుల్ల మధ్య బోనాలను తీశారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద నిత్యపూజ, రాత్రి పుట్టబంగారం తీసుకువచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

5న ఆర్యసమాజ్ మందిరం వార్షికోత్సవం

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఆర్యసమాజ్ మందిరం 38వ వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను 5వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యసమాజ్ మందిరం ప్రతినిధులు సోమవారం తెలిపారు. వార్షికోత్సవ ఉత్సవాల సందర్భంగా చిన్నారులకు వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముగింపు కార్యక్రమానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి, ఓయూ అధ్యాపకులు ధర్మతేజ ఆర్య, తెలంగాణ ఆర్యవీర్ దళసంచాలకులు ఆచర్య వేదసింధు హాజరవుతున్నారన్నారు.

కామారెడ్డి బల్దియా మాజీ చైర్‌పర్సన్ నానమ్మ మృతి

కామారెడ్డి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్‌రావు సతీమణి హైమావతి సోమవారం ఉదయం మృతి చెందింది. హైమావతి కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి నానమ్మ. విశ్రాంత హెడ్‌మాస్టర్ హైమావతి మృతికి అనేక మంది ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు, పట్టణ ప్రజలు సంతాపం తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ పుల్లెన్ నాగన్న అనారోగ్యంతో మృతి చెందారు. 2001 నుంచి 2006 వరకు బిచ్కుంద గ్రామ సర్పంచ్‌గా కొనసాగారు. గతంలో ఆయన గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. గతంలో ఆయన హయంలో మురికి కాలువలు, సీసీ రోడ్లు వేసి గ్రామ అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని ఆయన సేవలను నేటికి ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.ఆయన మృతిపట్ల ప్రజా ప్రతినిధులు, ప్రజలు సంతాపం ప్రకటించారు.

లబ్ధిదారుడికి బీమా చెక్కు అందజేత

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామానికి చెందిన పుర్ర లక్ష్మికి సోమవారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ రాజేందర్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేశారు. లబ్ధిదారు భర్త పుర్ర రాములు అనారోగ్యంతో కొంత కాలం క్రితం మృతి చెందాడు. మృతుడు ఐవోబీ బ్యాంకులో ప్రధాని జీవన జ్యోతి యోజన పాలసీ చేసుకోవడంతో పాలసీ డబ్బులు వచ్చినట్లు తెలిపారు. మృతుని భార్యకు పాలసీ డబ్బులు అందజేసినట్లు మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాము, సిబ్బంది జగన్, నరేందర్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సతీష్



కామారెడ్డి టౌన్ : పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గాంధారి మండల కేంద్రానికి చెందిన అనుముల సతీష్ నియమితులయ్యారు. సోమవారం కొత్తగూడెంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో సతీష్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర కమిటి ప్రకటించింది.